సమగ్ర తెలుగు దినపత్రిక

# అడుగు

Website: www.adugunews.com

The Step Towards The Truth..

హైదరాబాద్ | బుధవారం 04 ఫిబ్రవరి 2026 | సంపుటి: 01 | సంచిక: 351 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## ఓపికే గెలిచింది

- అవమానాల్ని భరించాం
- విమర్శల్ని సహించాం
- అమెరికాతో వాణిజ్యంపై స్థిరంగా ఉన్నాం
- ఎన్డీఏ ఎంపీల భేటీలో ప్రధాని మోదీకి సన్మానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని మిగతా 3లో..

## చమురుపై చర్చే లేదు

- కొనుగోళ్ళ నిలుపుదల నిజం కాదు
- ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం వేళ రష్యా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ స్పందించింది. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పరోక్షంగా మిగతా 3లో..

# ఎప్ స్టీన్ ఫైల్స్ భయమేనా?

- ట్రంప్ కి మోదీ ఎందుకు లొంగారు?
- మోదీ అమెరికాకు అమ్ముడు పోయారు
- తన పరువు కోసం దేశాన్నితాకట్టు పెట్టారు
- ఆదానీ కేసులో భయం పట్టుకుంది
- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు
- రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం
- చర్చకు విపక్షాల పట్టు.. సభ నేటికి వాయిదా



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు మిగతా 2లో..

## ఆత్మ నిర్భర్ కు గ్లోబల్ బూస్ట్!

### భారత్, అమెరికా ఒప్పందం చారిత్రాత్మకం : పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): ఇండియా, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ ఆర్థిక వ్యవస్థను కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఒప్పందంపై కీలక ప్రకటన చేశారు. భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం చారిత్రాత్మక మిగతా 2లో..

# లెక్క తేలింది

### 'పుర' బరిలో 12,993 మంది అభ్యర్థులు

- 7,320 మంది పోటీ నుంచి ఉపసంహరణ
- 116 మునిసిపాలిటీల పరిధిలో ఎన్నికలు
- ఉపసంహరణపై పలుచోట్ల ఉద్రిక్తతలు
- ప్రధాన పార్టీలలో ఎన్నికల కుమ్ములాటలు
- చిచ్చు రాజేసిన టికెట్లు, బీఫామ్‌ల కేటాయింపు



హైదరాబాద్,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): మునిసిపల్ ఎన్నికల బరిలో 12,993 మంది అభ్యర్థులు నిలిచారు. రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీల పరిధిలో 2,996 వార్డులకు గాను గత నెల 30న నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈ ఎన్నికల్లో పోటీ కోసం 20,313 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ లు మంగళవారం పూర్తయిన అనంతరం 12,993మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. కాగా, మిగతా 3లో..

## నేడు మహబూబ్‌నగర్‌కు బీజేపీ బాస్ నితిన్ నబీన్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం మహబూబ్‌నగర్‌కు రానున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నేతలతో జరిగే సమ్మేళనంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాబోయే మునిసిపల్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయడంతో పాటు, రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై విస్తృతంగా చర్చించనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణలో పర్యటించడం కావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం మిగతా 2లో..

## నేడు కడియం విచారణ

### అనర్హత పిటిషన్‌పై స్పీకర్ ఆదేశాలు

హైదరాబాద్,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. నేడు ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా మిగతా 2లో..

# గెలిచి తీరాల్సిందే!

## సర్వేలన్నీ కాంగ్రెస్ కే అనుకూలం

- రెబెల్స్ ను బుజ్జగించండి
- అసంతృప్త నేతలను కలుపుకుపోండి
- కొత్త, పాతలను సమన్వయం చేయండి
- నేతలంతా క్షేత్రాల్లోనే ప్రచారంలో ఉండండి
- మున్సిపోల్స్ పై మంత్రులకు సీఎం దిశానిర్దేశం
- మంత్రులకు క్షేత్రస్థాయి బాధ్యతలు అప్పగింత
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాలని సూచన
- మున్సిపోల్స్ బరిలోకి ప్రధాన పార్టీల ముఖ్య నేతలు

నేడు మిర్యాలగూడకు సీఎం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభం

హైదరాబాద్,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. పార్టీ శ్రేణులను, మంత్రులకు కీలక సూచనలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులతో భేటీ అయిన ముఖ్యమంత్రి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క స్థానాన్ని కూడా వదులుకోకుండా క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో మంత్రుల పాత్ర అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులందరూ తమకు కేటాయించిన జిల్లాలకు తక్షణమే వెళ్లాలని, అక్కడ మున్సిపాలిటీల వారిగా క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా వెనుకబడిన మున్సిపాలిటీలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ పార్టీ పరిస్థితిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విశ్లేషణ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు మంత్రులు జిల్లాల్లోనే ఉంటూ, మిగతా 3లో..



## ఇక శత్రువు జాడ సులువు

- ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం
- భారత రక్షణ రంగంలో మరో ముందడుగు
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో ప్రయోగం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్-టు-ఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం మిగతా 2లో..

## రెండేళ్ళైనా జాబ్ కేలండరేది?

### నిరుద్యోగుల పాలిట కాంగ్రెస్ శాపం : కేటీఆర్



హైదరాబాద్,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఐదేళ్లలో ఇస్తామంటూ మాట మార్చడం నిరుద్యోగులను మోసం చేయడమేనని మండిపడ్డారు. తొలి ఏడాదే రెండు లక్షల నియామకాలు మిగతా 2లో..

# గవర్నర్ కోటాకు లైన్ క్లియర్

- ఎమ్మెల్సీల ఎంపికకు సుప్రీం ఉత్తర్వులు అడ్డుకాదు
- కేబినెట్ నిర్ణయానికనుగుణంగా గవర్నర్ కే అధికారం
- తదుపరి విచారణ మార్చి 19న, సుప్రీం కోర్టు స్పష్టం



హైదరాబాద్,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం మిగతా 2లో..

## గోప్యతను కాదంటే... గో!

- ప్రైవసీ పాలసీని పాటించాల్సిందే
- మా చట్టాలను కాదంటే వెళ్ళిపోండి
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(అడుగు న్యూస్): ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం మిగతా 2లో..

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..
RNI No : APTEL/2010/35251

## సంపాదకీయం
## మార్గం - అడుగు



# ఏపీలో 'కల్తీ' ఆజ్యం'!

సాక్షాత్తు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంలో పడింది. లడ్డూ తయారీలో ఉపయోగించే 'నెయ్యి కల్తీ' అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను తీవ్ర ఉద్రిక్తతల్లోకి నెట్టింది. పవిత్ర ఆలయ ప్రసాదం రాజకీయ యుద్ధంగా మారి, చివరికి పరస్పర దూషణలు, దాడులు, విధ్వంసాలకు దారితీయడం రాష్ట్ర ప్రజాస్వామ్య స్థాయిని దిగజార్చింది. రాజకీయాల్లో విమర్శలు సహజమే, కానీ, దానికి పవిత్ర ఆలయాన్ని ఆలవాలం చేసుకోవడమేగాక, హింసాత్మకం చేయడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

ఇటీవల జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు దాడి ప్రయత్నం, అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడులు, గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన ఘటనలు రాజకీయ అసహనానికి ప్రతీకలు. వైకాపా హయాంలో ఇలాంటివి జరిగాయని విమర్శించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు పునరావృతమవడం అత్యంత దురదృష్టకరం. అధికారంలో ఎవరు ఉన్నా, ప్రజాస్వామ్యంలో హింసకు ఆస్కారం ఇవ్వకూడదు.

పవిత్ర తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల శ్రీవారి ప్రసాదం కల్తీ నెయ్యితో తయారైందన్న అంశాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో ఆలయ భూములు, ఆభరణాలు, నియామకాలు, పూజా విధానాలపై వివాదాలు వచ్చినా, లడ్డూ ప్రసాదం అంశం మాత్రం మరింత సున్నితమైనది.

2024 మేలో చంద్రబాబు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుమల ప్రక్షాళనపై హామీలు ఇచ్చారు. కొత్త ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నియామకం తర్వాత లడ్డూ నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. టీటీడీ అధికారులే పోలీసులకు ఫిర్యాదు చేయడం, ప్రభుత్వం 'సిట్'ను నియమించడం వేగంగా జరిగిపోయాయి. ఇదే సమయంలో టీటీడీ మాజీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి సిట్‌కు బదులుగా సీబీఐ విచారణ కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

సుప్రీం కోర్టు ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఆధారాలు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ప్రకటించి భక్తుల మనోభావాలను దెబ్బతీయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు పలికింది. అనంతరం సీబీఐ దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో విచారణ జరిపి 36 మందిని నిందితులుగా చార్జిషీటులో చేర్చింది. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలే బాబా డెయిరీ నిర్వాహకులు విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా గుర్తించింది.

సీబీఐ నివేదిక ఈ వివాదానికి మరో మలుపు ఇచ్చింది. నెయ్యిలో భారీ స్థాయిలో కల్తీ జరిగిందని, అది అసలు నెయ్యే కాదని తేల్చినప్పటికీ, జంతు కొవ్వు లేదా పంది కొవ్వు కలిపినట్టు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. నమూనాల్లో నిజమైన నెయ్యి శాతం చాలా తక్కువగా ఉండగా, పామాయిల్, పామ్ స్టియరిన్, ఇతర రసాయనాలు కలిపినట్టు నిర్ధారించింది. భోలే బాబా డెయిరీ నుంచి పాలు లేదా నెయ్యి సరఫరా అయిన దాఖలాలు లేవని కూడా పేర్కొంది.

ఈ నివేదికను తమకు అనుకూలంగా మలుచుకుంటూ వైసీపీ నేతలు 'మేము నిర్దోషులం' అన్న ప్రచారాన్ని తీవ్రం చేశారు. జగన్ సహా పలువురు నేతలు ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేస్తూ రాజకీయ సంకేతాలు పంపారు. అయితే నెయ్యిలో కొవ్వు లేదన్న అంశాన్ని మాత్రమే పట్టుకుని, 200 కోట్ల రూపాయలకుపైగా విలువైన కల్తీ నెయ్యి సరఫరా నిజాన్ని విస్మరించడం సరికాదు. కల్తీ జరిగిందన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు.

వాస్తవానికి ఈ వ్యవహారాన్ని ఒక పార్టీ లేదా ఒక ప్రభుత్వ వైఫల్యంగా చూడలేం. ఎవరు అధికారంలో ఉన్నా ఏడుకొండలపై అవినీతి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. పవిత్రతకు ప్రతీక అయిన తిరుమల వ్యవస్థలో లోపాలు కొనసాగుతున్నాయన్నది చేదు నిజం. కానీ ఈ అంశాన్ని రాజకీయంగా రెచ్చగొట్టి, ప్రజలను విభజించి, హింసకు ప్రేరేపించడం అత్యంత ప్రమాదకరం. అభ్యంతరకరం.

చివరికి ఈ వివాదం రాజకీయ విమర్శల నుంచి భౌతిక దాడుల వరకూ వెళ్లడం రాష్ట్రానికే కాదు రాజకీయాలకూ మంచిది కాదు. అధికార మార్పిడి ఇదే సంస్కృతి మరింత తీవ్రంతరం చేస్తుందన్న భయం సహజం. అందుకే ఇలాంటి సున్నితమైన పవిత్ర అంశాలను రాజకీయం చేయడం తగదు. పవిత్రమైన దేవాలయాలను రాజకీయ యుద్ధ భూములుగా వాడుకోచూడటం బుద్ధి తక్కువ తనం. పవిత్ర ఆలయాలను, వాటి మానాన వాటిని వదిలేద్దాం. భక్తుల మనోభావాలను గౌరవిద్దాం. అవమానపర్చడం ఆపేద్దాం. రాజకీయాలను వేరుగా చేద్దాం. ఇకిప్పుడు ఇల వైకుంఠాన్ని అకుంఠిత దీక్షతో పరిరక్షిద్దాం.

# గవర్నర్ కోటాకు లైన్ క్లియర్

మొదటిపేజీ తరువాయి..

తెలిసిందే. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. 2024 ఆగస్టు 16న కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని నెలల తర్వాత వీరిని పదవుల నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇది ఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది.సుప్రీంకోర్టు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. రాజ్యాంగ పరమైన అధికారాల వినియోగంలో అనవసరమైన సందేహాలకు చోటు లేదని, ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకునే ఉద్దేశం తమకు లేదని, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేందుకు మాత్రమే న్యాయవ్యవస్థ జోక్యం ఉంటుందని ధర్మాసనం చెప్పకనే చెప్పిందని చెప్పవచ్చు. మొత్తానికి, తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై నెలకొన్న అనిశ్చితికి సుప్రీంకోర్టు తీర్పు కొంతవరకు తెరదించింది. కేబినెట్ సిఫారసులే కీలకమన్న స్పష్టతతో, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ ఇక ముందుకు సాగనుంది. మార్చి 19న జరిగే తదుపరి విచారణ ఈ అంశానికి పూర్తి పరిష్కారం చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ సంస్థల మధ్య సమన్వయం ఎంత అవసరమో ఈ పరిణామం మరోసారి రుజువు చేసింది.

# ఎప్ స్టీన్ ఫైల్స్ భయమేనా?



మొదటిపేజీ తరువాయి..

దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు. ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ, వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది.

ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.మరోవైపు కాంగ్రెస్ నేతలు పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్ష, అధికార పక్షాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ఇకపై పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన ప్రశ్నలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

# ఇక శత్రువు జాడ సులువు

మొదటిపేజీ తరువాయి..

ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్-లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్‌ఈఎంఆర్‌ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# నేడు కడియం విచారణ

మొదటిపేజీ తరువాయి..

చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించి. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. రేపటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వాదించారు.గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని చెబుతూ, చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణ మోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు మాజరు కావాలని ఆదేశించారు.

# నేడు మహబూబ్‌నగర్‌కు బీజేపీ బాస్ నితిన్ నబీన్

ఏర్పడింది. మునిసిపల్ ఎన్నికల వేళ నితిన్ నబీన్ పర్యటన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ఈ సభ బీజేపీ అభ్యర్థుల గెలుపుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల్లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కార్యకర్తలు సభను వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సభ నిర్వహించనున్న ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో నాలుగు రోజులుగా ఏర్పాట్లు కొనసాగుతుండగా, మహబూబ్‌నగర్ నగరాన్ని కాషాయ జెండాలతో అలంకరించారు.

# రెండేళ్లైనా జాబ్ కేలండరేది?


మొదటిపేజీ తరువాయి..

చేపట్టకపోతే ప్రభుత్వాన్ని కూల్చేయండని ప్రియాంక గాంధీ స్వయంగా చెప్పారని, ఆ లెక్కన చూస్తే ఈ పాటికే సర్కారు గద్దె దిగాల్సి ఉండేదని ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి యువతను వంచించారని, ఇప్పుడు పీసీసీ చీఫ్‌తో సీఎం కొత్త పల్లవి పాడుతున్నారని ఎక్స్ వేదికగా విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తుది దశకు చేరిన 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం మినహా, రేవంత్ రెడ్డి సాధించిందేమీ లేదని, రాష్ట్రంలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయిందని దుయ్యబట్టారు.కేసీఆర్ హయాంలో లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, కానీ అప్పట్లో తమపై బురద చల్లి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పట్టుమని పది వేల పోస్టులకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేకపోయారని కేటీఆర్ ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరిట దగా చేశారని, నిరుద్యోగ భృతి ఊసే లేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, పోటీ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, కుంభకోణాలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిని గమనిస్తున్న తెలంగాణ యువత, తమకు జరిగిన అన్యాయంపై ఆదిలాబాద్ నుంచి పోటీ పరీక్షల కేంద్రమైన అశోక్ నగర్ చౌరస్తా వరకు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.కేవలం నిరుద్యోగులనే కాకుండా రైతులు, మహిళలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా వంచించిందని కేటీఆర్ విమర్శించారు. గత మూడు విడతలుగా రైతుబంధు సాయాన్ని ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పుల ఊబిలోకి నెట్టారని ధ్వజమెత్తారు.

# ఆత్మ నిర్భర్ కు గ్లోబల్ బూస్ట్!

మొదటిపేజీ తరువాయి..

నిర్ణయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలే పరమావధిగా ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిందని,



దీనికోసం దేశం గత కొన్ని నెలలుగా ఆసక్తిగా ఎదురుచూస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ జరిపిన చర్చల ఫలితంగా ఈ కీలక పరిణామం చోటుచేసుకుందని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. గతంలో భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై సుమారు 50 శాతం వరకు ఉన్న పన్ను భారం, తాజా ఒప్పందంతో 18 శాతానికి తగ్గిందని, ఇది మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తుల పోటీతత్వాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో రెట్టింపు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా టెక్స్ టైల్స్, లెదర్, జెమ్స్ అండ్ జ్యువెలరీ, సీఫుడ్ , స్పెషాలిటీ కెమికల్స్ వంటి రంగాలకు ఈ నిర్ణయం సంజీవనిలా మారుతుందని మంత్రి వెల్లడించారు. ఈ ఒప్పందంలో వ్యవసాయం , డైరీ వంటి సున్నితమైన రంగాలకు సంబంధించి భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుందని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో మేము ఎక్కడా రాజీ పడలేదు.. ఆయా రంగాలను ఈ ఒప్పందం నుంచి మినహాయించాము అని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల్ని ఆయన తోసి పుచ్చారు. అలాగే, రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేత అంశంపై వస్తున్న వార్తలపై క్లారిటీ ఇచ్చారు. దేశ ఇంధన భద్రత , వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా అమెరికా, వెనిజులా వంటి దేశాల నుంచి చమురు దిగుమతులను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. ఈ వాణిజ్య ఒప్పందం ప్రకటించిన వెంటనే భారత స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో పయనించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇన్వెస్టర్లలో పెరిగిన నమ్మకం దేశాభివృద్ధికి నిదర్శనమని, దీనివల్ల లక్షలాది మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. అమెరికా వంటి అగ్రరాజ్యంతో సమానస్థాయిలో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడం ద్వారా 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పీయూష్ గోయల్ ధీమా వ్యక్తం చేశారు.

# గోప్యతను కాదంటే... గో!

మొదటిపేజీ తరువాయి..

చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

తొర్రూరు, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్):
మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంటింటి ప్రచారాన్ని ఉద్ధృతంగా నిర్వహించారు. ఈ రోజు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి పేర్ల జంపన్న, 3వ వార్డులో అభ్యర్థి తూర్పాటి రవి గెలుపు కోసం ప్రతి



గడపను తట్టుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా ప్రజలతో స్నేహపూర్వకంగా మమేకమై, బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు జై తెలంగాణ... జై దయన్న అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా అభివాదం చేయగా, మాజీ మంత్రి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ మరియు సోషల్ మీడియా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారం నిర్వహించారు.

## ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ జోరు

తొర్రూరు, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్):
పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో, తొర్రూరులో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు



తెలిపారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి గారు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకురాలని, నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నారని ఝాన్సి రాజేందర్ రెడ్డి ప్రశంసించారు. అనంతరం తొర్రూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బొమ్మనబోయిన సుజాత వెంకన్న, 11వ వార్డులో అభ్యర్థి పొనుగోటి సోమేశ్వరరావు గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

పాలకుర్తి, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్):
పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరాగాని కుమారస్వామి పాల్గొని ఎమ్మెల్యేకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి



సంబరాలు జరిపారు. నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై స్పందిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికే అంకితంగా పనిచేస్తున్న నాయకురాలిగా యశస్విని రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మదర్సాలో దుప్పట్ల పంపిణీ:

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ జెడ్పి కోఆప్షన్



సభ్యులు మహమ్మద్ మదార్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు అబ్బాసలీ ఆధ్వర్యంలో పాలకుర్తి మండల కేంద్రంలో గల మదర్సాలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఓపికే గెలిచింది

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్



కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

# గెలిచి తీరాల్సిందే!

మొదటిపేజీ తరువాయి..

అక్కడ జరుగుతున్న పరిణామాలను, పార్టీ పురోగతిని వివరిస్తూ తనకు రోజువారీ నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో సహజంగానే టికెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉంటుందని, ఈ క్రమంలో టికెట్ దక్కని నేతలను బుజ్జగించాలని సూచించారు. ఈ పని కూడా మంత్రులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పార్టీ కోసం పని చేసే పాత నేతలకు , ఇటీవల పార్టీలో చేరిన కొత్త నేతలకు మధ్య ఎటువంటి విభేదాలు రాకుండా సమన్వయం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఒక్క ఓటు చీలిపోకుండా జాగ్రత్త పడాలని అని మంత్రులకు ఉద్బోధించారు. అందరూ సమిష్టిగా పని చేస్తేనే విజయం సాధ్యమని, ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల గెలుపు ఓటములకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులే పూర్తి బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చారు. ప్రతి స్థానాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయిలో అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని ఆదేశించారు. మంత్రులకు దిశానిర్దేశం చేయడమే కాకుండా స్వయంగా ప్రజల్లోకి వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. బుధవారం నుంచి ఆయన జిల్లాల పర్యటనలు ప్రారంభించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు భారీ బహిరంగ సభల్లో పాల్గొంటారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. డిసెంబర్-5 కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పర్యటన, బహిరంగ సభ ఉంటుంది. డిసెంబర్-6న నిజామాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. డిసెంబర్-7 రంగారెడ్డి జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో పర్యటిస్తారు. డిసెంబర్-8న వరంగల్ జిల్లా భూపాలపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. డిసెంబర్-9మెదక్ జిల్లా పర్యటనతో ప్రచారం ముగుస్తుంది. ఈ పర్యటనల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను కవర్ చేసేలా ఈ షెడ్యూల్ రూపొందించారు.

# చమురుపై చర్చే లేదు

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించారు. ఈ అంశంపై న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయని పెస్కోవ్ పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ తన



దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుందని రష్యా విశ్వాసం వ్యక్తం చేసింది. ఇటీవల మోదీతో జరిపిన ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేస్తామని మోదీ తనకు మాటిచ్చారని ట్రంప్ ప్రకటించారు. తాము జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఇది అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. అయితే ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే రష్యా నుంచి ఈ వివరణ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. భారత్ వంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోందని పెస్కోవ్ ఆరోపించారు. వాషింగ్టన్ నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నా న్యూఢిల్లీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఉంటాయని రష్యా బలంగా నమ్ముతోంది. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని, ఎలాంటి మార్పులు ఉంటే దౌత్య మార్గాల్లో సమాచారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, భారత్ తక్కువ ధరకు రష్యా ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యా నుంచే తీరుతున్నాయి. ఈ వాణిజ్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు, రష్యాకు కూడా ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో చమురు కొనుగోళ్లు ఆపేయడం అంత సులభం కాదని, ఇది కేవలం ట్రంప్ రాజకీయ విన్యాసాల్లో భాగం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# లెక్క తేలింది

మొదటిపేజీ తరువాయి..

నామినేషన్ల తిరస్క రణ, ఉపసంహరణ ప్రక్రియలో 7,320మంది పోటీ నుంచి తొలగిపోయారు. మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని డీజీపీ శివధర్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల క్రమంలో ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లోని జిల్లా ఎస్పీలు, కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ)లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ మాట్లాడారు. పోలీసు అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఏ చిన్న ఉల్లంఘనను ఉపేక్షించవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ, ప్రచారంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాలపై పోలీసు లీగల్ అడ్వయిజర్ శ్రీరాములు పోలీసు అధికారులకు వివరించారు. ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకుని రావడం, లేదా నామినేషన్లు అడ్డుకోవడం, ప్రచారానికి అడ్డంకులు కల్పించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మరోవైపు.. కాంగ్రెస్‌లో మున్సిపల్ ఎన్నికలు చిచ్చు రాజేశాయి. అంతర్గత కుమ్ములాటలకు దారి తీశాయి. పార్టీలో టికెట్ల కేటాయింపు, బీఫామ్‌ల అందజేతలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. రాష్ట్ర వ్యాప్తంగా అసంతృప్త జ్వాలలు ఎగిశాయి. కొట్లాటలు, రాజీనామాలు, ధర్నాలు, కన్నీళ్లు, శాపనార్థాలతో కాంగ్రెస్ కార్యాలయాలు అట్టుడికిపోయాయి. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం చివరి రోజు కావడంతో రెబల్స్ నామినేషన్ ఉపసంహరించుకునేలా చేసేందుకు పార్టీ నేతలు నానా తంటాలు పడ్డారు. ఇప్పటికే పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న అసలు కాంగ్రెస్, వలస కాంగ్రెస్ నేతల మధ్య వర్గపోరు మున్సిపల్ ఎన్నికలతో తారస్థాయికి చేరింది. వలస కాంగ్రెస్ నేతలకు బీఫామ్‌లు ఇస్తూ అసలు కాంగ్రెస్ నేతలకు మొండిచెయ్యి చూపడంపై ఆ వర్గం రగిలిపోతున్నది. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండి, ఏండ్లుగా పార్టీ కోసం సేవ చేసిన తమను కాదని, కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిరసనగా పలు జిల్లాల్లో కీలక నేతలు పార్టీకి రాజీనామా చేశారు. బీఫాంల అందజేతలో ట్విస్టులపై ట్విస్టులు నెలకొన్నాయి. తొలుత ఒకరికి బీఫాం ఇచ్చిన పార్టీ.. ఆ తర్వాత మరొకరికి కేటాయించింది. అదే విధంగా పలు చోట్ల ఒకే వార్డుకు ఇద్దరు అభ్యర్థులకు బీఫాంలు ఇవ్వడం గందరగోళానికి దారితీసింది. అటు బీఆర్ఎస్ లోనూ అక్కడక్కడ ఉద్రిక్తతలకు దారి తీసింది.





## శెపాతీ పొంగాల్నంటే, గిట్ల కాల్వాలె!

రోగాలెక్కువైనయి కాబట్టి ఆరోగ్యం మీద ధ్యాసెక్కువైంది. బియ్యమన్నం తింటే, బీపీ, షుగర్లొత్తానయని, ఇగిప్పుడంతా




శెపాతీలు తినబట్టిరి. మరి గా శెపాతీలు బుస్సున పొంగి, కమ్మగుండాల్నంటే ఏం శేయాల్నో తెలుసా?

ఇగో గా శెపాతీల్ని కాల్సేటప్పుడు... తాల్చిన శెపాతీని పెనం మీద ఏసినంక, ఓ గిలాసకు మంచినూనె అంటించి ఒత్తాల్నట. గట్ల ఒత్తుకుంట, తిప్పుకుంట గా శెపాతీని కాలిస్తే, గది బుస్సున పొంగుతదట. మెత్తమెత్తగ కమ్మగ ఉంటదట. మరి మీరూ శేసి సూడుండ్లి.

## వైఎస్ షర్మిలను కలిసిన నాయకులు

అనంతపురం, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్):
ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యలపై జేఏసీ చెలిమప్ప ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు కావడం లేదని, బిల్లులు ఆలస్యం కావడంతో పేద వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ సబ్‌ప్లాన్ నిధులు





మళ్లించకుండా అర్హులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జేఏసీ నాయకులు నాగరాజు, దుర్గేష్, నరసింహులు, వెంకటేశులు, గంగాధర, రామాంజనేయులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని గోళ్ల గ్రామ ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను తరలించిన తరువాత గ్రామంలోనే యథావిధిగా సేవలు కొనసాగిస్తామని అధికారులు హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు సేవలు ప్రారంభించకపోవడంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్సీ ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఏవో కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వెంటనే ఆయుర్వేదిక్ సేవలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గోళ్ల గ్రామ ప్రజలు, ఎస్సీ ఎస్టీ జేఏసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## కొల్లాపూర్ రాజకీయ పోరు ఉత్కంఠభరితం

కొల్లాపూర్, ఫిబ్రవరి 3 (అడుగు న్యూస్):
నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో తుది బరిలో 60 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ (టీఆర్ఎస్), బీజేపీలకు చెందిన మొత్తం 85 మంది





అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. మొత్తం 19 వార్డులకు గాను కొల్లాపూర్ మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్ తరఫున మంత్రి జూపల్లి కృష్ణారావు అన్ని స్థానాల్లో విజయం సాధించి తన రాజకీయ సత్తా చాటాలనే లక్ష్యంతో ప్రచారాన్ని ఉద్ధృతం చేస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తున్నారు. బీజేపీ తరఫున పార్టీ ఇన్‌చార్జి ఎలియన్స్ సుధాకర్ రావు కనీసం కొన్ని స్థానాలైనా గెలుచుకునే దిశగా విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారాయి.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# తారాజువ్వలా ఇషాన్ కిషన్

**గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్**

**టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?**

**అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్**

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్



నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

## పాక్ తీరుతో కుప్పకూలనున్న క్రీడా ఆర్థిక వ్యవస్థ!

క్రికెట్ ప్రపంచంలో అత్యంత క్రేజ్ ఉన్న పోరు అంటే అది భారత్-పాకిస్థాన్ మ్యాచ్ మాత్రమే. మైదానంలో ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కళ్లు టీవీలకు అతుక్కుపోతాయి. అయితే, 2026 టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన భారత్-పాక్ లీగ్ మ్యాచ్‌పై నీలి నీడలు కమ్ముకున్నాయి. భద్రతా కారణాలు లేదా రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో క్రికెట్ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా వణికిపోతోంది. క్రీడా విశ్లేషకులు, ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, కేవలం ఈ ఒక్క మ్యాచ్ రద్దు కావడం వల్ల అంతర్జాతీయ క్రికెట్ మార్కెట్ దాదాపు రూ. 4,500 కోట్ల



(ఏ500 మిలియన్లు) మేర నష్టపోనుంది. ఈ భారీ నష్టం కేవలం ఒక విభాగం నుంచే కాకుండా పలు కోణాల్లో ఉండనుంది:
ప్రసార హక్కులు, ప్రకటనలు: దాయాదుల పోరుకు ఉండే వ్యూవర్‌షిప్ దృష్ట్యా ప్రకటనల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ మ్యాచ్‌లో కేవలం 10 సెకన్ల ప్రకటన స్లాట్ ధర రికార్డు స్థాయిలో రూ. 25 లక్షల నుండి రూ. 40 లక్షల వరకు పలుకుతోంది. మ్యాచ్ రద్దయితే కేవలం అడ్వర్టైజ్‌మెంట్ల రూపంలోనే రూ. 300 కోట్ల ఆదాయం గాలిలో కలిసిపోతుంది. ప్రపంచకప్ ప్రధాన స్పాన్సర్లు భారత్-పాక్ మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకునే భారీగా పెట్టుబడులు పెడతారు. మ్యాచ్ జరగకపోతే ఇన్వెస్టర్ల నమ్మకం దెబ్బతినడంతో పాటు మార్కెట్ విలువ పడిపోతుంది. టికెట్ల అమ్మకాలు, పర్యాటకం: కొలంబోలో జరిగే ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే వేలాది మంది అభిమానులు విమాన టికెట్లు, హోటల్ బుకింగ్‌లు చేసుకున్నారు. మ్యాచ్ రద్దుతో పర్యాటక రంగం కూడా కోట్లాది రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల మ్యాచ్ రద్దయితే బీమా లభిస్తుంది. కానీ, ఒక దేశం లేదా జట్టు కావాలని మ్యాచ్‌ను బహిష్కరిస్తే దానికి ఎటువంటి బీమా వర్తించదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనివల్ల ఐసీసీ తో పాటు ఇరు దేశాల బోర్డులకు భారీ ఆర్థిక భారం తప్పదు. భారత క్రికెట్ బోర్డు ఆర్థికంగా చాలా బలంగా ఉన్నందున ఈ నష్టాన్ని తట్టుకోగలదు. కానీ, ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇది ఆత్మాహుతి నిర్ణయం వంటిదే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐసీసీ నుంచి పాక్ బోర్డుకు ఏటా అందే సుమారు ఏ34.51 మిలియన్ల ఆదాయంపై కూడా దీని ప్రభావం ఉండవచ్చు. ఒకవేళ పాక్ రాకపోతే భారత్‌కు వాకోవర్ పాయింట్లు లభించి, విజేతగా ప్రకటిస్తారు.

# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

## వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్

ఐసీసీ టీ - 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో



తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్-ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్-ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్--పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ లేకపోతే ప్రకటనల ద్వారా రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 10 సెకన్ల ప్రకటనకు రూ.40 లక్షల వరకు వసూలు చేసే స్థాయిలో ఈ మ్యాచ్‌కు ఆదరణ ఉంది.మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, మహమ్మద్ యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్, మొహ్సిన్ ఖాన్ లాంటి పలువురు మాజీ క్రికెటర్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో, పాకిస్తాన్ తుది నిర్ణయం ఏవిధంగా ఉంటుందన్నది అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిగా మారింది.




సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



# పిఆర్‌పై పెద్దగా ఆధారపడను

## రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్

గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్దానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.

# దురంధర్-2 షూట్‌లో డ్రోన్ వినియోగం

## నిషేధిత ప్రాంతం కావడంతో పోలీస్ కేసు

ముంబైలోని హై-సెక్యూరిటీ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ కెమెరాను ఉపయోగించినందుకు గాను బాలీవుడ్ మూవీ 'ధురంధర్ 2' చిత్ర బృందంపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. దక్షిణ ముంబైలోని పోర్ట్ ప్రాంతంలో ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా డ్రోన్‌ను వినియోగించినందుకు చిత్ర లొకేషన్ మేనేజర్ రింకూ రాజ్‌పాల్ వాల్మీకిపై పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు సమాచారం.

గత మూడు రోజులుగా ముంబై ఫోర్ట్ ప్రాంతంలో 'ధురంధర్ 2' షూటింగ్ కొనసాగుతుండగా, చిత్ర బృందం ఈ చారిత్రాత్మక ఫోర్ట్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లోని ఒక పాత వీధిని తలపించేలా సెట్ వేసింది. ఫిబ్రవరి 1న జరిగిన షూటింగ్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే నిబంధనలకు విరుద్ధంగా గాలిలోకి డ్రోన్‌ను ఎగురవేయడం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ముంబైలోని పోర్ట్ ప్రాంతం ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలకు కేంద్రం కావడంతో ఇక్కడ భద్రతా



కారణాల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై కఠినమైన ఆంక్షలు అమలులో ఉన్నాయి. అలాగే డ్రోన్ ఎగురవేయడానికి ముందు తీసుకోవాల్సిన తప్పనిసరి అనుమతులను చిత్ర యూనిట్ తీసుకోలేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

దీంతో వెంటనే స్పందించిన పోలీసులు లొకేషన్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఎవరినీ అరెస్టు చేయనప్పటికీ, భద్రతా నిబంధనల ఉల్లంఘనపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు. హై-సెక్యూరిటీ జోన్లలో షూటింగ్ జరుపుకునేటప్పుడు చట్టపరమైన అనుమతులు కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## దరుంధర్-2 టీజర్ విడుదల

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. 'ధురంధర్:ది రివెంజ్' పేరుతో మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా.. రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. 'ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది' అని రణ్‌వీర్ సింగ్ రివెంజ్ డైలాగుతో అదరగొట్టారు.




Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005